
# * బూతోద్యమం *

సినిమా అంటే ఏంటి? వినోద ప్రధానమైనది.

యస్సేనా?...యస్!

కానీ అంత వినోద ప్రధానమైన సినిమా ఎంతమందికి టెన్షన్ కలిగిస్తుందో మీకు తెల్సా?




మొదట ప్రొడ్యూసర్‌ని తీస్కుందాం....

పాపం... ఆయనకేమో మొదటినుండీ టెన్షన్సే...

స్టార్టింగప్పుడు సరియైన కథ దొరుకుతుందో లేదోనని టెన్షన్!...కథ తయారయ్యేప్పుడు - రచయితతో హోటల్ రూంలో కూర్చుని కథా చర్చలు జరుగుతున్నప్పుడు టెన్షన్... ఎందుకంటే, అక్కడ రచయిత కంటే ఎక్కువ వేరేవాళ్ళే కథలు చెప్పేస్తారు.

కథ తయారయ్యేక నటీనటుల కాల్‌షీట్లతోనూ వాళ్ళకిచ్చే అడ్వాన్సు డబ్బులతోనూ టెన్షన్... షూటింగులో టెన్షన్... అంతా అయిపోయాక అన్ని లక్షలు ఖర్చు పెట్టిన ఆ సినిమా సరిగా ఆడుతుందో లేదోనని టెన్షన్.

ఇక డైరెక్టర్ విషయానికొస్తే... తాను డైరెక్ట్ చేసిన సినిమా హిట్టవుతుందో

లేదోనని టెన్షన్. ఎందుకంటే, సినిమా ఫ్లాపయిందంటే డైరెక్టర్ కూడా మునుగుతాడు. అప్పటికే అతను తీసిన సినిమాలు రెండు మూడు ఫ్లాప్ అయి వుంటాయి... ఇంక ఇది కూడా ఫ్లాప్ అయిందంటే అతని మీద ఫ్లాప్ డైరెక్టర్ ముద్ర పడిపోయి, వేరే ఎవరూ అతన్ని డైరెక్టర్‌గా బుక్ చేస్కోరు... సుబ్బరంగా యింటి దగ్గర కూర్చుని పెళ్ళాంతో అష్టాచెమ్మా ఆడుకోవల్సి వస్తుంది.

డైరెక్టర్‌కి ఇంకో రకం టెన్షన్ కూడా ఉంటుంది. అదేంటంటే తను సెలక్ట్ చేస్కున్న హీరోయిన్నో సైడ్ హీరోయిన్నో ... ఎవరు పిటపిటలాడ్తే వారిని రాత్రి తన గదిలోకి రమ్మంటే వస్తారో రారో?... ఇది అన్నిటికంటే పెద్ద టెన్షన్ మరి!

తర్వాత నటీనటుల టెన్షన్...

వాళ్ళకీ అంతే... సినిమా హిట్టవుతుందో లేదోననే టెన్షన్. ఎందుకంటే – సినిమా హిట్ కాకపోతే వాళ్ళకి పేరు రాదు మరి. వాళ్ళు నటించే సినిమాలు వర్సగా హిట్ అవుతే సూపర్‌స్టార్‌లు అయిపోయి లక్షలకి లక్షలు సంపాదిస్తారు.

ఏరియావైజ్ కొనుక్కున్న బయ్యర్స్‌కీ టెన్షనే... తాము పెట్టిన డబ్బు వస్తుందో లేదోనని.

వీళ్లందరూకాక ఫీల్డుకి సంబంధంలేని మామూలు జనాలకీ టెన్షనే!

సినిమా పిచ్చోళ్ళున్నారనుకోండి... ఫస్టుడే ఫస్టు షో టిక్కెట్టు దొరుకుతుందో లేదోనని వాళ్ళకీ ఎంతో టెన్షన్‌గా ఉంటుంది...

ఇకపోతే ఫామిలీతో సినిమాకి వెళ్ళేవాళ్ళకో? వాళ్ళకి యమ టెన్షన్‌గా ఉంటుంది సినిమా చూస్తున్నంతసేపూ...

హఠాత్తుగా కామెడియన్లు వచ్చి యేమేం బూతులు మాట్లాడతారో... హీరోయిన్ చటుక్కున చీరిప్పిపారేసి పీలికల లంగాతో ఎలాంటి డాన్సు చేస్తుందో... హీరో హీరోయిన్ల బూతు సరసాలు ఉన్నట్టుండి ఎప్పుడు మొదలుబెడ్తారో...

అంతా టెన్షన్... యమ టెన్షన్.

ఎందుకంటే ప్రక్కనే చెల్లెలుగానీ, అమ్మానాన్నలుగానీ, అక్కయ్యగానీ పిల్లలుగానీ ఎవరైనా కూర్చుని సినిమా చూస్తుండవచ్చు...

ఇదిగో... సరిగ్గా ఇప్పుడు అసలైన పాయింటికి వచ్చాం.

ఆ రోజు "దొంగ సన్నాసి మొగుడు" సినిమా రిలీజ్ అయ్యింది. ఆ

సినిమా నగరంలో దాదాపు పదిహేను హాళ్ళలో రిలీజ్ అయ్యింది. అందులో స్వర్గం థియేటర్ ఒకటి.
అప్పుడు సమయం ఉదయం పదిగంటలైంది.
ఆ సినిమా మార్నింగ్ షో పదకొండు గంటలకి. అయినా అప్పటికే జనం కిటకిటలాడిపోతున్నారు. టిక్కెట్ల కౌంటర్ దగ్గర జనం తోస్కుని చచ్చిపోతున్నారు.
స్వర్గం థియేటర్ మేనేజర్ క్యాబిన్‌లో థియేటర్ మేనేజర్, ఆ సినిమా డిస్ట్రిబ్యూటర్, ఆ మేనేజర్ బామ్మర్దీ ముగ్గురూ కూర్చుని ఉన్నారు. ముగ్గురి మొహాల్లో చచ్చేంత ఆనందం.
"మన సినిమాకి చాలా రష్షుంది.. ఓపెనింగ్స్ చాలా బాగుంటాయ్..." అన్నాడు మేనేజర్ ఉల్లాసంగా.
"సినిమా గురించి బాగా పబ్లిసిటీ ఇప్పించాం... అందుకే ఈ రష్షు!..." అన్నాడు డిస్ట్రిబ్యూటర్.
"నోనో... అదేంకాదు... హాలు బయట హీరోయిన్ గోచిగుడ్డలాంటిది కట్టుకుని ఉన్నది పెద్ద కటౌట్, హీరో హీరోయిన్లు నీళ్ళలో తడిసి అర్ధనగ్నంగా ఉన్న పోస్టర్లు చాలా పెట్టించా... అవి చూసే జనం ఇలా విరగబడి వస్తున్నారు!" అన్నాడు మేనేజర్ బామ్మర్ది.
"సినిమా చూడకముందే జనం ఇంతగా విరగబడిపోతుంటే ఇంక సినిమా చూశాక టిక్కెట్లకోసం హత్యలు చేస్కుంటారు!" గొప్పగా అన్నాడు డిస్ట్రిబ్యూటర్.
"ఏం?... ఏముందేంటీ సినిమాలో?" ఉత్సాహంగా అడిగాడు మేనేజర్.
"మన సినిమాలో హీరో హీరోయిన్లు, కామెడి జంటా డైరెక్టుగా పచ్చిబూతులు మాట్లాడ్తారు... గుడిసెల్లో వాళ్ళూ, కూరగాయలు అమ్మే ఆడాళ్ళూ దెబ్బలాడేటప్పుడు వాడే బూతులూ మన సినిమాలో పెట్టారు."
"అబ్బా!... హయ్యో!! హమ్మో!!" మేనేజరూ, మేనేజర్ బామ్మర్దీ ఇద్దరూ సంతోషంగా కేకలెట్టారు.
"అంతేకాదు... హీరో తల్లిదండ్రుల మధ్యకూడా రసవత్తరమైన బూతుల ట్రాక్ ఉంది. హీరోయిన్ నాయనమ్మ కూడా బూతులు మాట్లాడుతుంది."
"చాలా బాగుంది... చాలా బాగుంది." మేనేజర్, అతని బామ్మర్దీ బుర్రకాయలు ఊపారు సంతోషంగా.

"ఇంకా రెండు వర్షం పాటలూ, నాలుగు రేప్ సీన్‌లూ, పది ఫైటింగులూ, హీరోయిన్ గోచిగుడ్డతో నాలుగైదుసార్లు కనిపించే సీన్లూ ఇలా చాలా ఉన్నాయ్..." అన్నాడు డిస్ట్రిబ్యూటర్ బ్రహ్మానందపడిపోతూ.

"అయితే మన హాల్లో ఈ సినిమా సిల్వర్ జూబ్లీ జరుపుకుంటుం దన్నమాటే..." అన్నాడు మేనేజర్ సంబరంగా.

సరిగ్గా అప్పుడే హాలుబయట జనం హాహాకారాలు వినిపించాయ్.

"టిక్కెట్లు ఇవ్వడం స్టార్ట్ చేసినట్టున్నారు" అన్నాడు మేనేజర్.

ముగ్గురూ ఉత్సాహంగా బయటికి పరుగుతీశారు. హాలు బయట జనం టిక్కెట్లకోసం తోసుకుంటున్నారు – ఒకరినొకరు పిడిగుద్దులు గుద్దుకుంటున్నారు.

ఆ సీను చూసి వాళ్ళు ముగ్గురూ కడుపారా నవ్వుకున్నారు. పావుగంటలో బుకింగ్ క్లోజ్ అయిపోయింది. హౌస్‌ఫుల్!...

ముగ్గురూ పకపకా నవ్వుకుంటూ లోపలికి వెళ్ళిపోయారు.

కాస్సేపయ్యాక వాళ్ళకి తెలిసింది – ఆ సినిమా టిక్కెట్లు బ్లాకులో అమ్ముతున్నారనీ, వాటిని జనం పాతిక రూపాయలకి కొంటున్నారనీ.

సరే... ఇది ఇలా ఉండగా... మార్నింగ్ షో ఇంకాసేపట్లో అవుతుందనగా దాదాపు ఓ వందమంది ఆడాళ్ళు థియేటర్‌వైపు రావడం మేనేజర్ చూశాడు.

"వామ్మోవ్ ... మన సినిమాకు ఎంతమంది ఆడాళ్ళు వస్తున్నారో చూడండి... మందలు మందలుగా వస్తున్నారు!..." అన్నాడు.

"మరేం అనుకున్నావ్... ఇది మహిళా చిత్రం అని ఈ వేళ అన్ని పేపర్లలో పబ్లిసిటీ వేయించాంగా... దాన్నిచూసి ఇలా ఎగబడి వస్తున్నారు..." అన్నాడు డిస్ట్రిబ్యూటర్.

"అయితే ఇంకేం?... ఏ సినిమాకైనా ఆడవాళ్ళు ఎగబడ్డారంటే ఇంక అది హిట్టయినట్టే!..." అన్నాడు మేనేజర్ బామ్మర్ది.

వాళ్ళు ఇలా అనుకుంటుండగానే ఆ ఆడవాళ్ళంతా థియేటర్ దగ్గరికి వచ్చేశారు.

"ఆహా... ఓహో... ఇప్పుడు వీళ్ళనందర్నీ ఓ స్నాప్ తీసి, మహిళలంతా ఆదరిస్తున్న చిత్రం అని మన పేపర్ పబ్లిసిటీకి వాడుకుంటే... నా సామిరంగా..." అన్నాడు డిస్ట్రిబ్యూటర్.

అతని వాక్యం పూర్తి అయ్యీ అవకమునుపే ఆ మహిళలంతా థియేటర్ గోడలకున్న అసభ్య వాల్‌పోస్టర్లు పరపరా చింపెయ్యడం మొదలుపెట్టారు.

"వార్నాయినో... ఇదేంటి బాబోయ్..." అంటూ గుండెలు బాదుకున్నాడు మేనేజర్. ఈ హఠాత్ పరిణామం వాళ్ళ ముగ్గురికీ మింగుడుపడలేదు. కొంతమంది మహిళలు హీరోయిన్ గోచీలాంటి గుడ్డకట్టుకుని ఉన్న కటౌట్ ని కూల్చివేశారు.

ముగ్గురూ వాళ్ళ దగ్గరికి పరుగుతీశారు.

"ఏంటమ్మా ఈ దౌర్జన్యం... బంగారంలాంటి కటౌట్ ని కూల్చేశారేం?..." అన్నాడు మేనేజర్ వాళ్ళతో కోపంగా.

"బంగారంలాంటి కటౌటా?... అలాగైతే ఇది తీస్కెళ్ళి మీ ఇంట్లో పెట్టుకో......... ఇలా పబ్లిగ్గా పెట్టడానికి వీల్లేదు........." అంది వాళ్ళ నాయకురాలు.

"ఏం ఎందుకని?..." అడిగాడు డిస్ట్రిబ్యూటర్.

"ఎందుకంటే మేం బూతుకి వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టాం... ఇలాంటి అసభ్యమైన వాల్ పోస్టర్లు, కటౌట్ లూ ఎక్కడా ఉండడానికి వీల్లేదు..."

"మేం మళ్ళీ పెట్టుకుంటాం అంటే?" అడిగాడు మేనేజర్.

ఆమె ఏం మాట్లాడకుండా వెనక్కి తిరిగి చూసింది. ఆడాళ్ళంతా చీపుళ్ళూ, చెప్పులూ తీసి పైకెత్తి పట్టుకున్నారు.

"ఆ!..." అంటూ తెల్లబోయారు ఆ ముగ్గురూ.

ఇంతలో హాల్లోంచి ఒక అయిదారుమంది ఆడాళ్ళు వాంతి చేస్కుంటూ బయటికి వచ్చారు. ఒక మధ్య వయస్కురాలు మాత్రం వీళ్ళ దగ్గరికి వచ్చింది. మిగతావాళ్ళు బయటికి పరుగుతీశారు కందిపోయిన మొహాలతో.

"ఏంటి... ఇవన్నీ చింపేసి, కటౌట్ లు కూల్చేశారు... హి..హి.." పిచ్చి చూపులు చూస్తూ అడిగింది ఆమె.

"మేం బూతుకి వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టాం..." చెప్పింది మహిళా నాయకురాలు.

ఆ మధ్య వయస్కురాలు పకపకా నవ్వింది.

"ఈ పోస్టర్లు చింపితే సరిపోయిందా... మీరంతా లోపలికెళ్ళి సినిమా చూడండి..." అంటూ భళ్ళుమని డిస్ట్రిబ్యూటర్ బట్టలమీద వాంతి చేసేస్కుంది.

"సినిమాలో ఎంత బూతుందో తెలుసా?... బూతు వ్యతిరేక ఉద్యమం అంటే ఇలాంటి సినిమాలు కూడా ఆడనివ్వకూడదు... బూతు బొమ్మలూ, కథలూ ప్రచురించే పత్రికలమీద కూడా దాడి చెయ్యాలి!... అంతేగానీ ఇలా పోస్టర్లు చింపితే ఏం లాభం - మళ్ళీ అతికిస్తారు

- శాశ్వతంగా బూతుని నిర్మూలించండి... జై సీతారాం... హహహ... జై భజరంగ్ భళీ... హి... హిహి.." అంటూ పిచ్చిచూపులు చూస్తూ వెళ్ళిపోయింది ఆమె.

అంతే... ఆ ఆడాళ్ళలో చైతన్యం వచ్చింది. థియేటర్ క్యాబిన్‌లోకి వెళ్ళి సినిమా ఆపు చేయించారు... బూతు డైలాగులూ సీన్లూ కట్‌చేసి ప్రదర్శించమన్నారు.

"అవి కట్ చేస్తే సినిమానే ఉండదమ్మా తల్లీ!" అని మేనేజర్, డిస్ట్రిబ్యూటర్ మొత్తుకున్నారు.

"అదంతా మాకు తెలీదు" అని, ఆ సినిమా ప్రదర్శిస్తే హాలు బద్దలుకొడ్తాం అని వార్నింగ్ ఇచ్చి అక్కడినుండి వెళ్ళిపోయారు.

రాను రాను ఆ ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. ఆడవాళ్ళు బూతు డైలాగులు ఉన్న సినిమాలు ఆడనివ్వకుండా అడ్డుపడ్తున్నారు - వాళ్ళు చూడడం లేదు... ఇంట్లోని సభ్యుల్నీ చూడనివ్వడంలేదు.

చివరికి నిర్మాతలు చచ్చినట్టు అటువంటి అశ్లీల సినిమాలు తియ్యడం మానుకున్నారు.

(సారా వ్యతిరేక ఉద్యమంద్వారా మహిళలు తమ సత్తా ఏమిటో నిరూపించుకున్నారు. వాళ్ళు పూనుకుంటే అశ్లీల సినిమాలూ, అశ్లీల సాహిత్యం రూపుమాపగలరు. డియర్ మహిళలూ... మీ చూపు కాస్త నేటి పత్రికలూ, సినిమాల మీద కూడా త్రిప్పండి... ఈ అశ్లీల ప్రపంచంలోంచి జనాన్ని బయటికి లాగండి - రచయిత.)

* * *